వైభవంగా ఫలహారం బండి ఊరేగింపు



పీజేఆర్‌నగర్‌లో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: బోనాల వేడుకల్లో భాగంగా వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ కాలనీ, ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్‌లలో ఫలహారం బండి ఊరేగింపును మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ జాతరను ఘనంగా చేసుకోవాలనే ఉద్దేశంతో ప్రతి గుడికి బోనాల నిధులు మంజూరయ్యేలా కృషి చేశానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, హరినాథ్, ఎండి ఇబ్రహీం, పోతుల రాజేందర్, చంద్రమోహన్ సాగర్, ఎర్ర లక్ష్మయ్య, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దు



జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో మనం డబ్బులు చెల్లించడమే తప్ప విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉండదని, ఒకవేళ ఉన్నా.. కేవలం రూ.5 వేలలోపే ఉంటుందని సైబర్ క్రైమ్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్‌కి స్పందించి అధిక లాభాలు వస్తాయని చెబితే నమ్మి మోసపోవద్దని ఆన్‌లైన్‌లో వ్యాపారాలు, ఇన్వెస్ట్‌మెంట్‌ల జోలికి వెళ్లకూడదన్నారు.సైబర్ నేరాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, అనంతరం స్థానిక పోలీసులను సంప్రదించాలన్నారు.

మత్స్యకారులకు త్వరలో గుర్తింపు కార్డులు

- ఫిషర్‌మెన్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్



సమస్యలు తెలుసుకుంటున్న మెట్టు సాయికుమార్ తదితరులు

కూకట్‌పల్లి: ఆన్‌లైన్ విధానం ద్వారా మత్స్యకారులకు త్వరలో సభ్యత్వ కార్డులు అందజేస్తామని, వారికే ఫిష్ మార్కెట్‌లో వ్యాపారం చేసుకోవడానికి అర్హత ఉంటుందని ఫిషర్‌మెన్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ పోస్టాఫీస్ క్వార్టర్స్ పక్కన ఉన్న ఫిష్ మార్కెట్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఫిష్ మార్కెట్‌లో తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో చేసిన అక్రమాలపై విచారణ జరుపుతామన్నారు. సభ్యులు కాని వారికి మార్కెట్‌లో వ్యాపారం చేసుకోవడానికి అవకాశాలు ఉండవన్నారు. నిజమైన మత్స్యకారులను ఇబ్బంది పెట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ ఆఫీసర్ పూర్ణిమ సింగ్, జిల్లా ఫిషర్మెన్ ఛైర్మన్ మన్నె రాజు, వైస్ ఛైర్మన్ కాపర్తి కృష్ణ మోహన్, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, కూకట్‌పల్లి మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి, మాజీ వైస్ ఛైర్మన్ లక్ష్మయ్య, సంజీవరావు, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

'వినాయక ఉత్సవ సమితి' నూతన కమిటీ ఎన్నిక

చందానగర్ : చందానగర్ డివిజన్ పరిధిలోని గౌతమీనగర్ కాలనీ, చందానగర్, కాలనీల రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ వినాయక ఉత్సవ సమితి నూతన కమిటీని బుధవారం ఏర్పాటు చేయడం జరిగిందని బీజేపీ రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. నూతన కమిటీలో 23 మంది సభ్యులతో సమావేశం నిర్వహించారు. వినాయక చవితి పండుగ నేపథ్యంలో పలు తీర్మానాలను ఆమోదించారన్నారు.

నిఫ్ట్‌లో ప్రారంభమైన ఓరియంటేషన్ ప్రోగ్రాం



ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న నిఫ్ట్ సిబ్బంది

మాదాపూర్: మాదాపూర్‌లోని (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ)లో మూడురోజుల పాటు నిర్వహించనున్న ఓరియంటేషన్ ప్రోగ్రామ్–2024ను ప్రారంభించారు. అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(2024–28), పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ (2024–26) కోసం వచ్చిన బ్యాచ్ 245 అండర్ గ్రాడ్యుయేట్‌లు, 35 పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులతో సహా మొత్తం 280 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు నిఫ్ట్ డైరెక్టర్, డిపార్ట్‌మెంటల్ ఫ్యాకల్టీలతో ఇంటరాక్ట్ అయ్యారు.కార్యక్రమంలో వెల్సన్‌గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ భార్గవ మొవ్వ, నిఫ్ట్ కాస్ట్యూమ్ డిజైనర్ అర్చనరావు, టీవర్క్స్ తెలంగాణ సీఈఓ జోగిందర్ తనికెళ్ల, డైరెక్టర్ ప్రొఫెసర్ మాలిని తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో సమస్యలు రాజ్యమేలుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ నిజాంపేట్ అధ్యక్షుడు నరేంద్రచౌదరి అన్నారు. బుధవారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో కమిషనర్ రామకృష్ణారావును కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్రచౌదరి మాట్లాడుతూ ఇన్‌కాయిస్ సర్కిల్ నుండి ప్రగతినగర్ మూడుకోతుల బొమ్మ సర్కిల్ వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో తలెత్తుతున్న తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌ను పరిష్కరించాలని, గుంతలమయంగా మారిన అంతర్గత రోడ్లను బాగు చేయాలని, దోమల బెడదను నివారించాలని, అంబీర్ చెరువు సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు, ప్రొఫెసర్ చంద్రమౌళి, మదన్ గౌడ్, శ్రీధర్‌రెడ్డి, మైలారం అశోక్, సంతోష్‌గౌడ్, నవ్య, అనిరుద్ర, సాయి కిషోర్, అర్జున్ తదితరులు ఉన్నారు.

ఆదాయం..
ప్రయాణికులు ఫుల్
సౌకర్యాలు అంతంతే..

ఇదీ లింగంపల్లి రైల్వే స్టేషన్ దుస్థితి



శేరిలింగంపల్లి: నగర శివారులో అత్యధిక ఆదాయం, అధిక సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగించే స్టేషన్‌గా 'లింగంపల్లి' రైల్వేస్టేషన్ గుర్తింపు పొందింది. ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ ప్రాంతానికి ఇదే అతిపెద్ద రైల్వే స్టేషన్ కావడం, దూరప్రాంతాలకు రాకపోకలు నిర్వహిచే ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లే కాకుండా ఎంఎంటీఎస్ రైళ్లు కూడా ఇక్కడి నుంచే ప్రారంభించడంతో ఈ స్టేషన్‌కు అత్యంత ప్రాధాన్యం ఉంది. అయితే ఆ స్థాయిలో సౌకర్యాలు లేవు.

4,5 ప్లాట్‌ఫారమ్‌లలో ప్రయాణికుల అవస్థలు

- లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో పూర్తి స్థాయిలో కవర్డ్ షెడ్స్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు.
- ముఖ్యంగా 4,5 ప్లాట్‌ఫారమ్‌లలో కవర్డ్ షెడ్స్ పూర్తి స్థాయిలో లేకపోవడంతో ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారు.
- ఈ ప్లాట్‌ఫారమ్‌ల నుంచే అమరావతి, దేవగిరి ఎక్స్‌ప్రెస్, నారాయణాద్రి, గౌతమి ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెళతాయి.
- ఈ ప్లాట్‌ఫారమ్‌లలో ఒకే షెడ్డు ఉండటంతో వర్షం వస్తే వికారాబాద్ వైపు ఉన్న ప్రయాణికులు తడుస్తూ, వేసవి కాలంలో ఎండుతూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది.
- ఆయా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అటు, ఇటూ చివరలో జనరల్ బోగీల్లో ప్రయాణించేవారి ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అందుకే పూర్తిస్థాయిలో షెడ్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇంకా పరిష్కరించాల్సినవి

- రైల్వే స్టేషన్‌లో డ్రాపింగ్, పికప్ కోసం 6వ ప్లాట్ ఫారమ్‌లోని పార్సిల్ సెంటర్ సమీపంలో పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలి. దీంతో రోడ్డుపై ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తే ప్రయాణికుల ఇబ్బందులు తొలగుతాయి.
- లింగంపల్లి రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారమ్–11 వైపు కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసేందుకు షెడ్లు నిర్మించాలి.
- లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారమ్ 1,2 కలుపుతూ ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని లిఫ్ట్‌లతో చందానగర్ వైపు నిర్మించాలి.
- స్టేషన్‌లోని వికారాబాద్‌కు వెళ్లే వైపు ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి ప్లాట్‌ఫారం 2, 4 లలో ఎస్కలేటర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.
- స్టేషన్‌లో ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఎస్కులేటర్లు 24 గంటలకు పనిచేసేలా చూడాలి
- స్టేషన్‌లో రైల్వే పోర్టర్స్ సంఖ్యను మరింతగా పెంచాల్సిన అవసరాన్ని ఉన్నతాధికారులు గుర్తించాలి
- ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా లాక్ రూమ్ సౌకర్యం కల్పించాలి.
- లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి బీహెచ్‌ఈఎల్, ఇతర ప్రాంతాలకు బస్ సౌకర్యం అందుబాటులోకి తేవాలి.
- స్టేషన్‌కు రావడానికి అప్రోచ్ రోడ్ మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు తగిన చర్యలు చేపట్టాలి
- ప్రతి ప్లాట్‌ఫారమ్‌పై దివ్యాంగుల కోసం వీల్‌చైర్స్ అందుబాటులో ఉంచాలి.



4,5 నంబర్ల ప్లాట్‌ఫారాలలో షెడ్లు లేని దృశ్యం

ఓసీ సంఘం మేడ్చల్ జిల్లా
విద్యార్థి విభాగం అధ్యక్షురాలిగా హన్సికరెడ్డి



హన్సికరెడ్డికి నియామకపత్రాన్ని అందజేస్తున్న వెంకట సుబ్బారెడ్డి తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఓసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి నివాసంలో బుధవారం ఓసీ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి విభాగం మేడ్చల్‌జిల్లా అధ్యక్షురాలుగా హన్సికరెడ్డిని నియమిస్తూ ఓసీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కందనూరు వెంకట సుబ్బారెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ తెచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను దేశంలోని ప్రతి కుటుంబానికి తెలియజేయాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించిన ప్రధాని మోడీకి దేశంలో అగ్రవర్ణ పేదలు అందరూ కృతజ్ఞతగా ఉండాలని కోరారు. సమావేశంలో హన్సికరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో వెలువడే ప్రతి ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్‌లో ఓసీ అభ్యర్థులకు దరఖాస్తు రుసుం లేకుండా ఉచితంగా దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించాలని, అదే విధంగా ఓసీలకు ఐదు సంవత్సరాల వయోపరిమితి తగ్గించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, రాయలసీమ ఐటి విభాగం అధ్యక్షుడు కె.వి సురేష్ కుమార్, రామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శంకర్ రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్ ఆకట్టుకుంటోంది. శుభకార్యాలకు, పండుగలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకమైన చీరలు ముఖ్యంగా పటోలా,చందేరి, పోచంపల్లి, వెంకటగిరి, గద్వాల, బెనారస్, కోల్‌కతా, ఉప్పాడ, ధర్మవరం చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 80 స్టాల్స్‌లో ఏర్పాటు చేశారని, ఈనెల 5 వరకూ ఈ ప్రదర్శన కొనసాగుతుందని ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిర్వాహకులు శ్రీనివాస రావు తెలిపారు.



ఎగ్జిబిషన్‌లో వస్త్రాలను తిలకిస్తున్న మహిళ

బాధ్యతగా విధులు నిర్వహించిన వారిని గుర్తుంచుకుంటారు



సైబరాబాద్ కమిషనరేట్‌లో ..



పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానించిన కమాండెంట్ సన్నీ

- సైబరాబాద్ జాయింట్ కమిషనర్ డి జోయల్‌డేవిస్

రాయదుర్గం: పదవీ విరమణ అనంతరం కుటుంబంతో హాయిగా గడపాలని సైబరాబాద్ జాయింట్ కమిషనర్ డి జోయల్‌డేవిస్ సూచించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో 8 మంది పోలీస్ అధికారుల పదవీవిరమణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధులను బాధ్యతగా నిర్వహించిన వారిని అందరూ గుర్తుంచుకుంటారన్నారు. కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి ఏడీసీపీ (అడ్మిన్) రవిచందన్‌రెడ్డి, ఆర్ఐ హిమకర్, ఏఎస్ఐ కోఆపరేటివ్ సొసైటీ ఇన్‌చార్జీ మల్లేశం, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కొండాపూర్ బెటాలియన్‌లో..

గచ్చిబౌలి: పదవీ విరమణ అనేది ఉద్యోగంలో సాధారణమని కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ సి.సన్నీ పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్ 8వ బెటాలియన్‌కు చెందిన పలువురు ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా వారిని సత్కరించారు. ఏఆర్ఎస్ఐలు ఎస్.జేమ్స్, బాబూజీ, ఎన్.చంద్రశేఖరన్ ,బాలచంద్రలు పదవీ విరమణ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బి.వి.రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు రాంబాబు, హనుమాన్, పార్థసారథి, సీతారాం పాల్గొన్నారు.

ఎస్కీలో..

రాయదుర్గం: పదవీ విరమణ జీవితంలో అందరికీ తప్పదని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ) డైరెక్టర్ డా.రామేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఎస్కీ కార్యాలయంలో ఎస్‌పీజీఎస్ డిప్యూటీ మేనేజర్ నాంపల్లి నర్సింహ పదవీ విరమణ చేయగా ఆయనను డైరెక్టర్, ఇతర అధికారుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: ప్రజా క్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. 55 మంది లబ్ధిదారులకు మంజూరైన 18 లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘునాథ్ రెడ్డి, నాయినేని చంద్రకాంత్‌రావు, జనార్దన్ రెడ్డి, సత్యనారాయణ, పోతుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే షీ టీంలు



మహిళలకు ,విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పటాన్‌చెరు టౌన్: మహిళలను ఆదుకునేందుకు ప్రభుత్వం షీ టీంలు ఏర్పాటు చేసిందని, అత్యవసర సమయంలో మహిళలు వినియోగించుకుని రక్షణ పొందవచ్చని పటాన్‌చెరు హెడ్ కానిస్టేబుల్ ఇస్మాయిల్ అన్నారు. జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో, మిషన్ శక్తి సంకల్ప్ కింద 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాలలో భాగంగా బుధవారం పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండ గ్రామంలో పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ సెంటర్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు, మహిళలకు బాలల హక్కులు, షి టీమ్ సేవలు, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, ఆన్‌లైన్ భద్రత, లింగ సమానత్వం, లింగ వివక్షత, సఖి సర్వీసెస్, చైల్డ్‌లైన్ సేవలు, సైబర్ నేరాలు, పిల్లల అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల నివారణ, ఆరోగ్యం మరియు పోషకాహారం, హెల్ప్ లైన్ నంబర్లు (1098,100,181,112,1930) గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జెండర్ స్పెషలిస్ట్ యాదగిరి, షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ శివకుమార్, ముంతాజ్, కానిస్టేబుల్ శంకర్, గ్రామ పంచాయతీ సెక్రటరి భవాని, మాజీ ఎంపీటీసీ అంతిరెడ్డి , అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

కార్లు బ్రేక్ డౌన్.. ట్రాఫిక్ జాం



సైబర్ టవర్ రోడ్డులో బ్రేక్ డౌన్ అయిన కారును పక్కకు తరలిస్తున్న దృశ్యం



హెచ్‌సీయూ రోడ్డులో..

గచ్చిబౌలి: వాహనాలు ఆకస్మాత్తుగా బ్రేక్ డౌన్ కావడంతో ట్రాఫిక్ జాం నెలకొంటుంది. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో హైటెక్స్ నుంచి సైబర్ టవర్ వైపు వెళ్లే కారు బ్రేక్ డౌన్ అయ్యింది. దీంతో ట్రాఫిక్ జాం నెలకొంది. మాదాపూర్ ట్రాఫిక్ సిబ్బంది వాహనదారుల సహకారంతో కారును పక్కకు తరలించారు. తిరిగి సాయంత్రం 4.30 గంటల సమయంలో గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వైపు వెళ్లే కారు బ్రేక్ డౌన్ అయ్యింది. ట్రాఫిక్ జాం కావడంతో విషయం తెలుసుకున్న గచ్చిబౌలి పోలీసులు స్థానికుల సహాయంతో కారును పక్కకు తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో
ప్రభుత్వం విఫలం

రామచంద్రాపురం (పటాన్‌చెరు): మహిళలకు రక్షణ కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. బీజేపీ పిలుపు మేరకు బుధవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా రామచంద్రాపురంలోని ఆమె నివాసంలో పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజు రోజుకు రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని , ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నందారెడ్డి, రజిని, శ్రీలక్ష్మీ, బసవమ్మ, గీత, కనకరాజు, మల్లేష్, నరసింహులు పాల్గొన్నారు.

కాలనీల్లో
కార్పొరేటర్ పర్యటన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్పనగేష్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డినగర్ కాలనీలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు డ్రైనేజీ సమస్యను ఆమె దృష్టికి తీసుకు వచ్చారు. జాతీయ రహదారిని అనుకుని ఉన్న దుకాణదారులు మ్యాన్‌హోల్స్ కనిపించకుండా మూసివేయడం జరిగిందన్నారు. దాంతో కాలనీకు చెందిన డ్రైనేజీ నీరు జాతీయరహదారి అనుకుని ఉన్న మెయిన్‌లైన్ నుంచి మురుగు నీరు పోవడంలేదన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాలనీవాసులు మాధవరెడ్డి, తిరుమలగౌడ్, పురుషోత్తంరెడ్డి, సుభాన్ రెడ్డి, సహదేవ్‌గౌడ్ పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు తొలగించరా..



డోయెన్స్ కాలనీ రోడ్డులో కుప్పలుగా చెట్లకొమ్మలు

శేరిలింగంపల్లి: డోయన్స్ కాలనీలో చెట్లకొమ్మలను కొట్టి కుప్పలుగా వేశారు. ఇరవై రోజులు అవుతున్నా వాటిని తొలగించకపోవడంతో కాలనీవాసులు అసౌకర్యానికి గురవుతున్నారు. డోయన్స్ కాలనీ కమ్యూనిటీహాల్ నుంచి పెట్రోల్ పంపు వరకు ఉన్న రోడ్డులో విద్యుత్ స్తంభాలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను నరికివేసి కుప్పలుగా వేసి, వాటిని తొలగించడంతో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ రోడ్డులో రాకపోకలు సాగించే స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు కాలనీ వాసులు ఇబ్బందుల పాలవుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

